


క్షేత్రస్థాయిలో సాగుపాఠాలు

క్లాస్‌రూంలో పాఠాలతో పాటు క్షేత్రస్థాయిలో కూడా వ్యవసాయ విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్నారు. వివరాలు 8లో ▸



గేదె తాడు అడ్డు రావడంతో..

దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌కు గేదెతాడు అడ్డువచ్చి అదుపుతప్పడంతో భర్త మృతి చెందాడు. వివరాలు 8లో ▸



శిథిల భవనంలోనే విధులు

యాభై యేళ్ల కిందట నిర్మించిన స్కూల్ భవనంలో ఆ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. వివరాలు 9లో ▸

సాక్షి సిద్దిపేట

మంగళవారం । 5 । ఆగస్టు । 2025

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

సిద్దిపేట సీపీ అనురాధ



సైబర్ వారియర్స్‌తో సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి వచ్చిన టీషర్ట్స్‌ను సీపీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సైబర్ వారియర్స్‌కు వచ్చే ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ కేసుల్లో పూర్తి ఆధారాలు సేకరించి నేరస్తులను గుర్తించడం, నేరగాళ్లకు శిక్షలు పడేలా చేయడమనేది సైబర్ వారియర్స్ చాలెంజ్‌గా స్వీకరించాలని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లాలోని సైబర్ వారియర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూడీఐడీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్‌ఆర్యా

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు యూడీఐడీ దివ్యాంగుల శిబిరానికి హాజరై గుర్తింపు కార్డును పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్యా సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నడవలేని వారికి ఆగస్టు 14, 28వ తేదీల్లో, మానసిక, కంటిచూపు, వినికిడి సమస్యలున్న వారికి 07,21,28వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు అనంతరం వారికి కేటాయించిన సమయానికి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటి చెరువు దగ్గరలో గల ప్రభుత్వాస్పత్రికి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

నకిలీ ఎరువుల దందాను అరికట్టాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోన్న నకిలీ ఎరువుల దందాను వ్యవసాయ అధికారులు అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైతు సంఘం కార్యాలయంలో సంఘం నాయకులతో కలసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేరున్న కంపెనీల ఎరువుల బస్తాలకు కృత్రిమ కొరత సృష్టించి ,అధిక లాభాల కోసం నాసిరకం ఎరువులు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కొంతకాలంగా నాసిరకం విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వుల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, నూకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్వర పరీక్షలు నిర్వహించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ధనరాజ్

సిద్దిపేటకమాన్: ఆరోగ్య కేంద్రానికి జ్వర లక్షణాలతో వచ్చే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి టీహబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ అధికారులు, ఎల్‌టీలు, సూపర్‌వైజర్లతో సోమవారం డీఎంహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, సోఫాస్ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌వే.. ప్రయాణం సులువే!



సిద్దిపేట జిల్లాలో రాజీవ్‌రహదారి

తెరపైకి కొత్త ప్రతిపాదన

- ఆర్‌ఆర్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త రహదారి
- శామీర్‌పేట నుంచి రామగుండం వరకు 207కిలోమీటర్లు
- సిద్దిపేటతోపాటు ఉత్తర తెలంగాణకు ప్రయోజనం!

రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ పెరిగి ప్రమాద ఘంటికలు మోగుతున్న వేళ... ఈ రహదారికి ప్రత్యామ్నాయంగా ఎక్స్‌ప్రెస్‌వే తీసుకురావాలనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. సిద్దిపేటతోపాటు ఇతర ఉత్తర తెలంగాణ జిల్లాల రాకపోకలకు రాజీవ్ రహదారి కీలకం. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదిస్తున్న ఎక్స్‌ప్రెస్‌వే కార్యరూపంలోకి వస్తే ఉత్తర తెలంగాణ జిల్లాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

గజ్వేల్: మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల మీదుగా మంచిర్యాల, రామగుండం ప్రాంతం వరకు 207కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. 15ఏళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణకు రూ.1,450కోట్లకుపైగా వెచ్చించారు. బీఓటీ(బిల్ట్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఈ పనులు పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణలోని మేడ్చల్, సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో గల పలు జాతీయ రహదారులను కలిపే ఈ దారి అత్యంత కీలకమైనది. ప్రత్యేకించి హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు, వరంగల్ హైవే, నేషనల్ హైవే–44 తదితర హైవేలతోపాటు కొత్తగా నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్‌తోనూ ఈ రహదారి అనుసంధానం కానుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రహదారి మలుపులు సరిచేయకుండానే విస్తరణ పనులు చేపట్టిన కారణంగా తరుచూ ఎన్నో ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఎలివేటెడ్ కారిడార్‌తో అనుసంధానం..

రాజీవ్ రహదారిపై మలుపులు సరిచేయడం, ఆరు లేన్లుగా విస్తరించే అంశాన్ని ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ క్రమంలో రాజీవ్‌రహదారికి ప్రత్యామ్నాయంగా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించాలని భావిస్తోంది. ఇది పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా ఉంటుందని చెబుతున్నారు. సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 18కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ కారిడార్‌తో ఎక్స్‌ప్రెస్‌వేను అనుసంధానం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం రూ.4వేలకోట్లకుపైగా వ్యయం అవుతుందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు ప్రతిపాదనలు పంపింది.

సిద్దిపేట జిల్లాలో 90 కి.మీటర్లపైనే!

రాజీవ్ రహదారి సిద్దిపేట జిల్లాలో ములుగు మండలం వంటిమామిడి నుంచి బెజ్జంకి మండలం దేవక్కపల్లి వరకు సుమారుగా 90కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. రాజీవ్‌రహదారికి ప్రత్యామ్నాయంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రతిపాదన కార్యరూపంలోకి వస్తే ఈ జిల్లాలోనే సింహభాగం విస్తరించే అవకాశముంది. దీంతో ప్రత్యేకించి సిద్దిపేట జిల్లాలోని ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ప్రయాణం ట్రాఫిక్ చిక్కుల్లేకుండా మరింత సులువుగా మారనుంది. ప్రత్యేకించి గజ్వేల్ ప్రాంతానికి హైదరాబాద్ మరింతగా చేరువగా మారనుంది. ఇప్పటికే ఈ నియోజకవర్గంలోని ములుగు, మర్కూక్, వర్గల్, గజ్వేల్ మండలాలు మెగా హెచ్‌ఎండీఏ పరిధిలోకి వెళ్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రతిపాదన ఈ ప్రాంతానికి కలిసిరానున్నది. అదేవిధంగా ఉత్తర తెలంగాణలోని ఇతర జిల్లాలకు సైతం ప్రయోజనం చేకూరనుంది.



స్వామివారి తొలిదర్శనానికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న యాదవులు

తెలవారే.. తొలి దర్శనం

దుబ్బాక: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన దుబ్బాక బాలాజీ ఆలయం చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు పుణ్యాహవచనంతో బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో సన్నిధిగొల్ల(యాదవులు) ఆలయం తెరిచే ఆచారాన్ని బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిసారి దుబ్బాక బాలాజీ ఆలయంలో చేపట్టారు. సోమవారం తెల్లవారుఝామునే యాదవులు కుటుంబసమేతంగా పట్టణంలో పట్టువస్త్రాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. అనంతరం సంతానం కోసం నిర్వహించిన ప్రత్యేక హోమం కార్యక్రమానికి 2వేలకు పైగా దంపతులు హాజరై గరుడ ప్రసాదాలను స్వీకరించారు. కాగా, స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.



సంతానభాగ్యం కోసం స్వామివారి గరుడ ప్రసాదం కోసం తరలివచ్చిన దంపతులు

అర్జీలను సత్వరం పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విద్యార్థులు

157 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి కలెక్టర్ కె.హైమావతి అర్జీలను స్వీకరించారు. అంతకుముందు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు నమ్మకంతో ప్రజావాణికి వస్తున్న క్రమంలో వారికి న్యాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయించాలని ఆదేశించారు.వివిధ పరిశ్రమల స్థాపనకు టీజీఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ విభాగాల వారీగా పరిశీలన చేసి అనుమతులివ్వాలని అధికారులకు సూచించారు. కాగా, ప్రజావాణిలో 157 దరఖాస్తులు వచ్చాయి.

కుక్ సతీశ్‌ను బదిలీ చేయవద్దు

మేము చిన్నకోడూరులోని బీసీ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులం. హాస్టల్లో కుక్‌గా పనిచేస్తున్న సతీశ్‌ను బదిలీ చేశారు. తమకు చాలా రోజులుగా వంటలు వండుతూ సాయంత్రం సమయంలో ట్యూషన్ నిర్వహిస్తూ ఎంతో సహాయకారిగా ఉండేవాడు. ఎలాగైనా కలెక్టర్ స్పందించి సతీశ్‌ను బదిలీ చేయకుండా మళ్లీ తమ హాస్టల్‌కు వచ్చేలా చూడాలన్నారు. అంతకుముందు విద్యార్థులు కొద్దిసేపు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై సర్కారు నిర్లక్ష్యం



విద్యార్థులకు బ్యాగులు అందజేసిన ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య,ఫారూఖ్ హుస్సేన్

- రెండేళ్లుగడుస్తున్నా ముందుకు సాగని పనులు
- ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. మల్లన్న సాగర్ అనుబంధంగా మండలంలోని ఎల్లారెడ్డిపేట వద్ద నిర్మిస్తున్న మినీ పంప్‌హౌజ్, పైప్‌లైన్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుసేన్ మనవలు ఎండీ కరీమోద్దిన్,యాసీనుద్దిన్, మనవరాలు అయేషా సుల్తానాల పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఘనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ఉప కాలువలు నిర్మించాలని పలుమార్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇర్కోడ్ పైపులైన్ పనులు 90% బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పూర్తిచేసిందన్నారు. మిగిలిపోయిన పనులు రెండేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయలేదని ఆరోపించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మల్లన్న సాగర్ నుంచి సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప కాలువ పనులు వేంటనే పూర్తిచేయాలని లేకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్య, వైద్యం ఉచితం చేయాలి

పేదలకు విద్య, వైద్యం అందనిద్రాక్షలా మారిందని, ఆ రెండింటినీ ఉచితంగా అందించాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నేడు ప్రతీ ఒక్కరి సంపాదనలో సింహభాగం విద్య ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వ్యవస్థల్లో మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అంతకు ముందు తొగుటలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మండలంలోని ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్, సబ్ జూనియర్ అండర్–15 బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య తెలిపారు. మిరుదొడ్డిలో సోమవారం ఆయన మాట్లాడుతూ..సీనియర్ జట్టుకు శశికుమార్, శ్రీనివాస్, చైతన్య, భరత్, కృష్ణసాయి, రవి, కిరణ్, రవితేజ, నవీన్, స్టాండ్ బాయ్స్‌గా మునీరొద్దీన్, రామ కోటి ఎంపికయ్యారన్నారు. బాలికల సబ్ జూనియర్ జట్టుకు శ్రావణి, నిహారిక, నందిత, లలిత, శరణ్య, సఫియా, సోహ, జెస్సీ, మనోవర్ధిని, శ్రీతేజ, తనిష్కలు ఎంపిక కాగా, సబ్ జూనియర్ బాయ్స్ జట్టులో చైతన్య, కృష్ణసాయి, సిద్విక్, మనికంఠ, సాకేత్, మోయిన్, భవన్, అక్షిత్, లలిత్, కౌశిక్, ఆర్యలు ఎంపికయ్యారు. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలో సీనియర్ జట్లు పాల్గొంటాయని తెలిపారు.



ఉమ్మడిజిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

సీపీఎస్ రద్దు చేయాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి వంగ మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దును డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నానో యూరియా డాప్‌తో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి

కొండపాక(గజ్వేల్): నానో యూరియా డాప్ వినియోగంతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని బందారం గ్రామంలో ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ సంస్థ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా డాప్‌ల వినియోగంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ... నానో యూరియాను పిచికారీ చేయడం వల్ల కాలుష్యం తగ్గించడంతో పాటు సమర్థవంతంగా పంటలకు ఉపయోగపడుతుందన్నారు. 500 మిల్లీ లీటర్ల నానో యూరియా తక్కువ ధరకే లభిస్తుందని తెలిపారు.

యూరియా కోసం బారులు

- పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ
- క్యూలో ఉన్నా చాలామంది రైతులకు అందని వైనం

దుబ్బాక: ప్రభుత్వం, అధికారులు యూరియాకు కొరత లేదని రైతులకు సరిపడా నిల్వలున్నాయని గప్పాలు చెప్పుకోవడం తప్పా ఆచరణలో మాత్రం కానరావడంలేదు. దుబ్బాక పట్టణంలో సోమవారం యూరియా బస్తాల లారీ రావడంతో తెల్లవారక ముందే దుకాణం వద్దకు వందలాది మంది రైతులు తరలివచ్చి లైన్ కట్టారు. వందల సంఖ్యలో రైతులు ఉండడంతో ఒక్కో రైతుకు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ తీసుకుని 2 బస్తాల చొప్పున పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేశారు.

దొరకని రైతుల ఆందోళన

క్యూలో వేచి ఉన్నా చాలామంది రైతులకు యూరియా దొరకకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా లేక తమ పంటలు పాడైతున్నాయని ఇంకా ఎన్ని రోజులు ఈ తిప్పలు పడాలంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను తెప్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.



దుబ్బాకలో పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

మురుగుకు చెక్

గ్రామాల్లో డ్రైనేజీ చివర సోక్‌పిట్ల నిర్మాణం

గ్రామాల్లో మురుగునీటిని వృథాగా వదిలేస్తుండటంతో గ్రామచివరి నివాసితులు దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతూ రోగాల పాలవుతున్నారు. దీంతో వృథాగా పోతున్న మురుగునీటికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. అందులోభాగంగా గ్రామాల్లోని డ్రైనేజీ చివరి పాయింట్‌లో సోక్‌పిట్లను నిర్మించాలని నిర్ణయించింది. స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం), ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 సోక్‌పిట్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణం కోసం స్థలాలు వెదికే పనిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు.

- ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 మంజూరు
- గ్రామాల్లో నిర్మించేందుకు ముందుకు వచ్చేనా?

జిల్లా	ఎస్‌బీ	ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్	మొత్తం
సిద్దిపేట	403	51	454
సంగారెడ్డి	503	63	566
మెదక్	441	49	490

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలుండగా అందులో 1,510 గ్రామాల్లో టెయిలెండ్ సోక్‌పిట్లను నిర్మించనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 టెయిలెండ్ సోక్‌పిట్లు మంజూరు కాగా, ఎస్‌బీఎం ఆధ్వర్యంలో 1,347, ఎన్ఆర్ ఈజీఎస్‌లో 163 నిర్మించనున్నారు. ఒక్కో సోక్‌పిట్ నిర్మాణానికి రూ.92,747 నిధుల చొప్పున రూ14,00,47,970 వ్యయంతో నిర్మించనున్నారు. ఎస్‌బీఎం ఆధ్వర్యంలో నిర్మించే వాటికి 70% నిధులతో, గ్రామ పంచాయతీ 30%, 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్నారు. అయితే ఎన్ఆర్‌ఈజీఎస్‌లో మంజూరైన మొత్తం సోక్‌పిట్లను ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతోనే నిర్మించనున్నారు.



సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్ పంట పొలాల్లోకి చేరుతున్న డ్రైనేజీ నీరు

మురికినీటిని వృథాగా వదిలేస్తుండటంతోనే

గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. కానీ, మురికి నీటిని గ్రామం చివర చెరువుల్లో, ఖాళీ స్థలాల్లో పొలాల్లోకి వృథాగా వదిలేస్తున్నారు. దీంతో పల్లెల్లో చివరి నివాసితులు దోమలు, దుర్వాసనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారు. పలు చోట్ల వీటితో మరణించిన ఘటనలున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ముందుకు వచ్చేనా?

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడంతో సోక్‌పిట్లను నిర్మించేందుకు ముందుకు ఎవరొస్తారనే చర్చ అధికారుల్లో సాగుతోంది. ఎవరూ ముందుకు రాకపోతే నిధులు వెనక్కివెళ్లి పోయే అవకాశం ఉండటంతో సోక్‌పిట్ల నిర్మాణం కోసం టెండర్లు పిలిచి నిర్మాణం పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. అలాగే కొన్ని చోట్ల స్థల సమస్య సైతం తలెత్తే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వీటిని నిర్మాణం చేపడితే గ్రామం చివర ఉండే వారి ఇబ్బందులు తప్పనున్నాయి.

స్థలాలు గుర్తిస్తున్నాం

గ్రామాల్లో టెయిలెండ్ సోక్‌పిట్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నాం. అక్టోబర్ చివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. వీటి నిర్మాణంతో కొంత వరకు దోమలు, దుర్వాసనను నియంత్రించవచ్చు.

– జయదేవ్‌ఆర్యా, డీఆర్‌డీఏ, సిద్దిపేట

క్లుప్తంగా

లాంగ్ జంప్‌లో సాయితేజకు పతకం


సాయి తేజతో జావిద్ అలీ

సంగారెడ్డి: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 11వ తెలంగాణ అథ్లెటిక్ క్రీడల్లో భాగంగా లాంగ్ జంప్ విభాగంలో అండర్ –16లో సంగారెడ్డి జిల్లాకు చెందిన కె.సాయి తేజ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా అతడికి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండి జావిద్ అలీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. మిగిలిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గోవా మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

మునిపల్లి(అందోల్): భారీ ఎత్తున గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించిన గోవా మద్యం దొరికింది. మొత్తం 34 బాటిళ్లలో 14.850 లీటర్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అనుదీప్, వినారెడ్డి, నజీర్‌పాషాతో పాటు సిబ్బంది ఉన్నారు.

గంజాయి స్వాధీనం..

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం... జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రామచంద్రపురంలో సోమవారం దాడులు నిర్వహించారు. కంజర్ల రమేశ్, దినేశ్‌ల నుంచి 385 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

కాపర్ వైర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని కట్కూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ఇలా... గ్రామానికి చెందిన కొలుగూరి వెంకట్‌రెడ్డి పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. గుర్తించిన పలువురు రైతులు విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో దాదాపు 10ఎకరాల్లో ఆదివారం వరి నాట్లు చేశారు. దీంతో రైతులు పొలానికి నీరు ఎలా పారించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు జరిమాన

సంగారెడ్డి క్రైమ్ / సిద్దిపేటకమాన్ / పటాన్‌చెరు టౌన్: ఉమ్మడి జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు జిల్లా న్యాయస్థానాలు జరిమాన విధించాయి. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 11మందిని జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఆరు మందికి రూ.2వేలు, ఇద్దరికి రూ.1500, మిగతా ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 11మంది పట్టుబడ్డారని టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.18వేల జరిమాన, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన నలుగురికి రూ.6వేల జరిమాన విధించినట్లు తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 22 మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ చెప్పారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 21 మందికి రూ. వెయ్యి చొప్పున, మరో వ్యక్తికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సంగారెడ్డి క్రైమ్: కీచక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయిలో.. సాగు పాఠాలు

- గ్రామీణ కృషి అనుభవంలో వ్యవసాయ విద్యార్థులు
- కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన


రైతులతో కలిసి నాటు వేస్తున్న విద్యార్థులు

తరగతి గదిలో నేర్చుకునే విద్యతోపాటు, క్షేత్రస్థాయిలో సాగు పనులను పరిశీలిస్తూ ఆ పనులు చేయడంతో ఎక్కువ అవగాహన కలుగుతుంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తాము నేర్చుకుంటున్న సబ్జెక్ట్‌పై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన పొందుతున్నారు. గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా మండలంలోని శీలాంపల్లి గ్రామంలో వ్యవసాయ పనులు నేర్చుకుంటున్నారు. తాము తరగతి గదిలో చదువుకున్న విషయాలు రైతులకు తెలియజేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం తునికి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు తమ అనుభవాలను రైతులకు వివరిస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్):


శీలాంపల్లి రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి వ్యవసాయ విద్యార్థులు

సాగు విధానాల పరిశీలన..

గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా క్షేత్రస్థాయిలో విద్యార్థులు ప్రాజెక్ట్ మూడు నెలలు చేయాల్సి ఉండగా, నెలన్నర సమయం పూర్తయింది. ఈ సమయంలో వారు రైతులతో కలిసి వరినాట్లు వేయడం, పత్తి సాగులో మెలుకువలు, సాంకేతిక వ్యవసాయంలో భాగంగా డ్రోన్ల వినియోగం, సేంద్రీయ పద్ధతిలో వరి, మునగ సాగును పరిశీలిస్తున్నారు. వరికోత పూర్తికాగానే, కొయ్యకాళ్లలో మొక్కజొన్న సాగు చేసే పద్ధతులను నేర్చుకుంటున్నారు. అలాగే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించి, భూసారానికి అనుకూలమైన పంటలు సాగుచేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు సూచనలు...

భూసార పరీక్షలకు కావాల్సిన మట్టిని, నేల నుంచి ఏ విధంగా సేకరించాలో ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. పత్తికి సోకిన చీడపీడల గురించి వివరించి, వాటి నివారణకు చర్యలు సూచించారు. వరి, ఇతర పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతు నారువేసే సమయం నుంచి, పైరు కోసే వరకు ఏ సమయంలో ఏ పనులు చేయాలి? ముఖ్యంగా పురుగు మందులు పిచికారీ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే పద్ధతులను వివరిస్తున్నారు. గ్రామాల రైతులు ప్రత్యామ్నాయ పంటల దిశగా మొగ్గు చూపకుండా, ఎక్కువగా వరి సాగుకే ఆసక్తి చూపుతున్నారని, పంటమార్పిడి చేసేలా సైతం విద్యార్థులు సూచిస్తున్నారు. గ్రామంలో కనీసం 15 మంది రైతులు తప్పనిసరిగా సేంద్రీయ వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు గ్రామ రైతుల నుంచి వ్యవసాయంలో పూర్తి సమాచారం తెలుసుకోవడంతోపాటు, తాము నేర్చుకున్న విషయాలను రైతులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

సేంద్రీయ సాగుపై అవగాహన



రైతులు తమ ఆరోగ్య ప్రయోజనాలను, నేల సారాన్ని కాపాడుకునేందుకు తప్పనిసరిగా ఉన్న భూమిలో కొంతవరకైనా సేంద్రీయ వ్యవసాయం చేయాలి. తమ ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు కనీసం కొంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసే విధంగా కృషి చేస్తా. ప్రాజెక్ట్‌లో భాగంగా మేము రైతులకు తెలియజేసిన విషయాల కంటే, మేము వారి ద్వారా ఎక్కువ విషయాలు నేర్చుకున్నాం.

– టి.అక్షయ, అగ్రికల్చర్ విద్యార్థి, మల్లారెడ్డి యూనివర్సిటీ

రైతుల సహకారం బాగుంది



గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా శీలాంపల్లి గ్రామ రైతుల సహకారం బాగుంది. ఈ ప్రాజెక్ట్‌లో నేర్చుకున్న విషయాలు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. రైతులతో కలిసి చేసిన వ్యవసాయ పనులు మర్చిపోలేనివి. ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు గ్రామరైతుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటా. తరగతిలో నేను నేర్చుకున్న పాఠాలు రైతులకు క్షుణ్ణంగా వివరిస్తా.

– ఎస్.అశ్వినికుమారి, అగ్రికల్చర్ విద్యార్థి, మల్లారెడ్డి యూనివర్సిటీ

37లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

డీఆర్‌డీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో వన మహోత్సవం సందర్భంగా వర్షాకాలంలో 37లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించామని డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో 37లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఇందులో ఉపాధిహామి పథకం ద్వారా 25లక్షలు నాటేందుకు నిర్ణయించామన్నారు. కాగా ఇప్పటివరకు యాభైశాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో అవసరమైన పండ్లు, పూలు, ఇతర మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో యాభైవేల మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులకు ఫేస్ రికగ్నిషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని, తొంభైశాతం పూర్తి అయిందన్నారు. పింఛన్ డబ్బులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఈసీ ప్రేమ్‌కుమార్, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.


వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

గేదె తాడు అడ్డురావడంతో..

- బైక్ అదుపుతప్పి కిందపడిన దంపతులు
- భర్త మృతి..భార్యకు గాయాలు


రాజేశం

దుబ్బాక: రోడు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ కీర్తి రాజు వివరాల మేరకు... మండలంలోని రాజక్కపేటకు చెందిన ముదిగొండ రాజేశం(55) గ్రామంలో కిరాణదుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్య చంద్రకళతో దుబ్బాకకు కిరాణసామగ్రి కోసం వెళ్లారు. ఆదివారం సాయంత్రం సామాను తీసుకొని బైక్‌పై భార్యాభర్తలు స్వగ్రామానికి వస్తున్న క్రమంలో చెల్లాపూర్ శివారులో రోడ్డుప్రక్కన కట్టేసిన గేదె తాడు అడ్డువచ్చి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రాజేశం తలకు తీవ్రగాయం కావడంతోపాటు చంద్రకళకు గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా రాజేశం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూరగాయలు తీసుకొస్తుండగా మహిళ..


బాలమణి

దుబ్బాకరూరల్: బైక్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన అక్బర్‌పేటభూంపల్లి మండలం చిట్టాపూర్‌లో జరిగింది. ఎస్ఐ హరీశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గుజ్జెటి బాలమణి(58) ఆదివారం సాయంత్రం గ్రామ చౌరస్తాలో కూరగాయలు కొనుగోలు చేసుకుని ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో బైక్‌పై సిద్దిపేట వైపు నుంచి రామాయంపేటకు వెళుతున్న రఘునందన్ అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చి మహిళను ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా బైకిస్టుది మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పనుగుల్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది..


రాజ్‌కుమార్


సందీప్

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది మృతి చెందారు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో గల రాణే కంపెనీ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రంగయ్య కూతురు సంధ్యను మిరుదొడ్డి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం జరిపించారు. సంధ్య, రాజ్‌కుమార్ దంపతులు ఉపాధి కోసం వెళ్లి మేడ్చల్ పరిధిలోని కేఎల్‌ఆర్ కమాన్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కాగా, సంధ్య అమ్మమ్మగారి గ్రామమైన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన బోనాల పండుగకు వెళ్లారు. అదే రోజు సాయంత్రం రాజ్‌కుమార్ అత్తగారి గ్రామమైన కోనాపూర్‌కు బస్సులో చేరుకున్నారు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో బావ రాజ్‌కుమార్‌ను మేడ్చల్‌లో దింపడానికి బామ్మర్ది సందీప్ కారులో బయలుదేరారు. వీరు ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళుతుండగా రాజీవ్ రాహదారిపై రాణే కంపెనీ ఎదుట ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్, సందీప్ తీవ్ర గాయాలై దుర్మరణం చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూతురిని కడతేర్చేందుకు యత్నించిన తండ్రి

నర్సాపూర్ రూరల్: కన్న కూతురును కడతేర్చేందుకు ప్రయత్నించిన ఓ కసాయి తండ్రి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండలంలోని అచ్చంపేటలో జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీరామ్ ప్రశాంత్‌కు కొన్నేళ్ల క్రితం అచ్చంపేట గ్రామానికి చెందిన ఇందుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు రుతిక, రియాన్షిక ఉన్నారు. ఆరు నెలల క్రితం భార్యభర్తల మధ్య సంసారం విషయంలో గొడవ జరిగింది. దీంతో ఇందు ఇద్దరు కూతుళ్లతో పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రశాంత్ ఆదివారం అచ్చంపేటలోని భార్యాపిల్లల వద్దకు వెళ్లి చిన్న కూతురు తనకు పుట్టలేదని భార్యతో గొడవ పెట్టుకుని రియాన్షికను పైకిఎత్తి సీసీ రోడ్డుపై పడేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో మొదట నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఇందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న రమణకుమార్

కంది(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ పుస్తకాలను అందజేస్తున్నామని పుస్తకాల పంపిణీ ప్రత్యేక అధికారి రమణకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కందిలోని కేంద్ర ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సమర్థ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జోగప్ప, సీఎమ్ఓ వెంకటేశం, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి ఇల్లు నిర్మాణం

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: పంచాయతీ రోడ్డును అక్రమించి ఇల్లు నిర్మిస్తున్నా కార్యదర్శి అభ్యంతరం చెప్పకుండా సహకరిస్తున్నారని మండలంలోని ఆనేగుంట గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఓ వ్యక్తి యథేచ్ఛగా రోడ్డును అక్రమించి ఇంటి నిర్మాణం పనులు చేపట్టడంతో రహదారి కబ్జాకు గురవుతుందన్నారు. అడ్డుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా ఆయన కూడా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో చేపడుతున్న నిర్మాణం పనులు ఆపేసి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వట్‌పల్లి(అందోల్): తన భూమిలో అక్రమంగా షెడ్డు వేసుకొని భయబ్రాంతులకు గురి చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయాడు. గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరుతూ అందోల్ మండలంలోని తాద్మన్నూరు గ్రామ మాజీ సర్పంచ్ బోయిని లక్ష్మీనర్సింహులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు... గ్రామంలో తనకు 2.33 ఎకరాల పట్టా భూమిలో అక్రమంగా ఇతర ప్రాంతానికి చెందిన భీమ్‌రావు అలియాస్ రాజు అనే వ్యక్తి రేకుల షెడ్డు వేసుకున్నాడని తెలిపారు. షెడ్డును తొలగించాలని కార్యదర్శికి చెప్పానని, అలాగే ఎంపీడీవో, ఎంపీఓ, గ్రామ కార్యదర్శులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏప్రిల్ 25న జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశానని, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో రెండవసారి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కార్మిక చట్టాలను విస్మరిస్తున్న యాజమాన్యం

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజయ్య


మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరు టౌన్: కార్మిక చట్టాలను పరిశ్రమల యజమాన్యాలు విస్మరిస్తున్నాయని యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజయ్య అన్నారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పాశమైలారంలోని సువెన్ ఫార్మా పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫార్మా యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నదని ఆరోపించారు. కార్మికులను ఉత్పత్తిలో నేరుగా పని చేయించుకోవడం తప్పని అన్నారు. అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, పరిశ్రమ యూనియన్ నాయకులు వెంకటేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రభు, రాజు, మల్లేశ్, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యమంలో పటేల్ కీలకపాత్ర


పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్

- గీతంలో జాతీయ ఐక్యత సదస్సు
- చర్చాగోష్టిని ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పటాన్‌చెరు టౌన్: రైతులను ఏకం చేయడంలో, భారతదేశ వ్యవసాయ ఉద్యమాన్ని రూపొందించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో నిర్వహిస్తోంది. సోమవారం ఈ చర్చా గోష్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో ప్రస్తుత సవాళ్లను పరిష్కరించడంలో ఐక్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అంతకుముందు ఎస్పీ పరితోష్ పంకజ్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్ టి - సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఏఎస్ సంజయ్ జోషి, సామాజిక సమరస్థ మంచ్ జాతీయ కన్వీనర్ శ్రీ కె.శ్యామ్ ప్రసాద్, గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, డీన్ ప్రొఫెసర్ షీలా రెడ్డి, సోషియాలజీ ప్రొఫెసర్ నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

- నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్‌తో ఎంఓయూ
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత


ఎంఓయూను స్వీకరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, తదితరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: బయోటెక్నాలజీ విభాగంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో వారం రోజుల పాటు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణను అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ ఫౌండర్స్ కార్తీక్‌కుమార్ వెల్లడించారు. సోమవారం కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ మధ్య ఐదేళ్లకు అవగాహన ఒప్పందం కుదిరిందని వీరు తెలిపారు.అనంతరం విద్యార్థులను ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి రోహిని, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, బయోటెక్నాలజీ అధ్యాపకులు వేణు, ఎన్సీసీ ప్రతినిధులు పవన్, నీలకంఠం పాల్గొన్నారు.

కొత్త చెరువు వద్ద పైపులు ధ్వంసం

- ఇరిగేషన్ అధికారులకు రైతుల ఫిర్యాదు
- బాధ్యులపై చర్యలకు డిమాండ్


కొత్త చెరువు వద్ద ధ్వంసమైన పైపులైన్

జోగిపేట(అందోల్): సింగూరు నుంచి కాల్వల ద్వారా జోగిపేట కొత్త చెరువులోకి వచ్చే పైపులైనును కొందరు ధ్వంసం చేసి చెరువులోకి నీరు రాకుండా అడ్డుకున్నారని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా... సింగూరు ప్రాజెక్టు ద్వారా చెరువులోకి నీరు వచ్చేలా ప్రభుత్వం పైపులైనును ఏర్పాటు చేసిందని, ఆ నీటిని మళ్లించుకునేందుకు పైపులను, సిమెంట్ కట్టడాలను ధ్వంసం చేశారని రైతులు వాపోయారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సోమవారం అందోల్‌లోని ఇరిగేషన్ అధికారులకు జోగిపేట రైతులు ఫిర్యాదు చేశారు. సింగూర్ కెనాల్ నుంచి పైపుల ద్వారా కొత్త చెరువులోకి మాసానిపల్లి గ్రామం నుంచి నీళ్లు వస్తాయని, ఆ గ్రామంలోని చెరువులోకి వెళ్లే కాల్వ కూడా వేరుగా ఉందని పేర్కొన్నారు. అయితే ఆదివారం రాత్రి చెరువు వద్ద తాము చేసిన పనులను పూర్తిగా ధ్వంసం చేసి నీళ్లు రాకుండా అడ్డుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తాము ప్రశ్నిస్తే తమపై దాడికి ప్రయత్నించారని ఆరోపించారు.